


వంగరలో గజరాజుల అలజడి

ప్రజాశక్తి-వంగర

మండలంలో వివిధ గ్రామాల్లో గజరాజులు అలజడి సృష్టిస్తున్నాయి. ఈ నెల 22న శ్రీహరిపురం మీదుగా మండలంలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు భాగేంపేటలో తిష్ట వేశాయి. అక్కడ నుంచి సోమవారం నీలయ్యవలస, జగన్నాథవలస మీదుగా మడ్డువలస ప్రాజెక్టు సమీపంలో కొండపైన కొంత సమయం సంచరించాయి. అనంతరం మగ్గూరు, సంగాం చెరకు పొలాల్లోకి చేరుకున్నాయి. వరి నారుమడులు, మొక్కజొన్న, చెరకు పంటలను గజరాజుల గుంపు ధ్వంసం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజరాజుల వైపు ప్రజలు ఎవరూ వెళ్లకుండా తహశీల్దార్ డి.ఐజాక్, ఎస్ఐ ఆర్.జనార్దనరావు ఆయా గ్రామాల్లో పర్యటించి అప్రమత్తం చేస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది గజరాజుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నారు.

మోడీ హామీల అమలు కోసం మరో పోరాటం

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ



సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతులకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీల అమలు కోసం రెండో దశ పోరాటానికి రైతులు సిద్ధం కావాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన ఎన్‌పిఆర్ భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అధ్యక్షతన సోమవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభం దేశంలో కొనసాగుతోందని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఇతర వృత్తుల్లోకి మళ్లిపోతున్నారని చెప్పారు. ప్రధాని మోడీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం జాతీయ వ్యవసాయ కమిషన్ చెప్పినట్లుగా మద్దతుధరలు అమలు చేయలేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. మరోవైపు వ్యవసాయ పెట్టుబడి రెట్టింపు కంటే పెంచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు సంఘాల నేతలకు మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదని, పైగా రైతులు తిరస్కరించిన వ్యవసాయ చట్టాలను పరోక్షంగా అమలు చేయడానికి పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితుల్లో ఎస్‌కెఎం నాయకులు జూన్ 8, జులై 13న ఢిల్లీలో సమావేశమై, మోడీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం రెండో విడత ఉద్యమాన్ని ఆగస్టు నుంచి నవంబర్ 26 వరకు దేశవ్యాప్తంగా చేయాలని నిర్ణయించారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ ఈ నెల 30న విజయవాడలో రాష్ట్ర కన్వెన్షన్ నిర్వహించి, పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మార్చ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా బి.రాంబాబు, కమిటీ సభ్యులుగా మల్లేష్, లక్ష్మునాయుడు, అప్పలరాజు, గాడు అప్పారావు, తొత్తడి పైడిపునాయుడు, ఎస్.పైడిరాజు, ఆదినారాయణమూర్తి, బంగారునాయుడు, సన్యాసినాయుడు ఎంపికయ్యారు.

ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె.మల్లేష్, రైతు సంక్షేమ సంఘం నాయకులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, సుజల స్రవంతి పోరాట కమిటీ కన్వీనర్ చల్ల జగన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడు అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం (దాసరి భవన్) కార్యదర్శి పురం అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణమూర్తి, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు తొత్తడి పైడిపునాయుడు, జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, శంకరాన పైడిరాజు, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాసీ ఛార్జీలు చెల్లించాలి

ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా

రైతులకు కళాసీ ఛార్జీలు చెల్లించాలని కోరుతూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాటత్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కళాసీ ఛార్జీలు రైతులే చెల్లించి మిల్లులకు తరలించారని గుర్తుచేశారు. ఇంతవరకు రైతులకు కళాసీ ఛార్జీలు చెల్లించకపోవడం సరికాదన్నారు. పిఎసిఎస్‌లు, కొనుగోలు ఏజెన్సీలకు రైతులు వెళ్లి అడిగినా కళాసీ ఛార్జీలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రైతులకు కళాసీ ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణమూర్తి, నాయకులు గొంప కృష్ణమూర్తి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచులు

పంచాయతీలకు నిధులివ్వాలి

కలెక్టరేట్ ఎదుట సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయాలని ఎపి సర్పంచుల సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి రూ.2,010 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24కు రావాల్సిన రూ.2,031 కోట్ల కేంద్ర ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.4,041 కోట్ల నిధులు కూడా ఇంతవరకు పంచాయతీలకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వాలంటీర్లను, సచివాలయాలను 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టంలోని ఆర్టికల్ 243జి, 11వ షెడ్యూల్లో పేర్కొన్న ప్రకారం పంచాయతీల్లో విలీనం చేసి, సర్పంచ్ ఆధ్వర్యంలోనే అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపిటిసిల గౌరవవేతనాలను రూ.15 వేలకు, ఎంపిపి, జెడ్‌పిటిసిలకు రూ.30 వేలకు పెంచాలని కోరారు. ఉపాధి హామీ నిధులను పంచాయతీలకే ఇచ్చి, గ్రామసభల తీర్మానం ప్రకారమే, సర్పంచ్ ఆధ్వర్యంలోనే పనులను కూడా చేయించాలన్నారు. మైనర్ పంచాయతీలకు ఉచితంగా విద్యుత్తు ఇవ్వాలని కోరారు. మైనింగ్ సెస్, ఇసుకలో వాటా నిధులు, రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రొఫెషనల్ ట్యాక్స్, ఎంటర్టైన్మెంట్ ట్యాక్స్, నీటి తీరువా నిధులు, తలసరి గ్రాంట్, గ్రామీణ రోడ్ల నిర్వహణకు ఇచ్చే నిధులు 2019 వరకు పంచాయతీలకు వచ్చాయని, ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వడం లేదని చెప్పారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఎగ్గొట్టిన ఆ నిధులు సుమారు రూ.3 వేల కోట్లు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీల సొంత నిధులు, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్తు బకాయిలు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధి కోసం నిధులు వినియోగించకుండా పంచాయతీల సొంత నిధులపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఫ్రీజింగ్ ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సంఘం నాయకులు రౌతు స్వామి నాయుడు, మజ్జి రాంబాబు, ఇజ్జరోతు అప్పలరాజు, గేదెల లక్ష్మణరావు, టి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో..

సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ఎనిమిది గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయట్లేదన్నారు. కనీసం చదువుకోవడానికి పాఠ్య పుస్తకాలు ఇవ్వడం లేదని చెప్పారు. పాఠాలు చెప్పడానికి అధ్యాపకులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాలల నిర్వహణ ఇలా సాగితే విద్యార్థులు ఎలా పాస్ అవుతారని ప్రశ్నించారు. ఇప్పటికే ఈ సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డును కలవడానికి వెళ్తే వారిని నిర్దాక్షిణ్యంగా రోడ్డుపై అరెస్ట్ చేయడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుంటే, అవేవో గొంతెమ్మ కోరికల్లా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా, ప్రశ్నించే నాయకుల్ని, విద్యార్థుల్ని బెదిరించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, దీనికి ఎనిమిది గంటల నిరసన దీక్షలే ప్రారంభ సూచికని చెప్పారు. దీక్షలకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి, ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు

విద్యార్థుల సమస్యలపై వినతి

జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని స్పందనలో జెసి మయూర్ అశోక్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వినతి అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వసతిగృహాల్లో కండ్లకలకలతో చాలామంది విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఇళ్లకు వెళ్లిపోతున్నారని తెలిపారు. తక్షణమే వసతిగృహాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. బొబ్బిలి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న నైట్ వాచ్‌మేన్, విధుల నిర్వహణలో లోపభూయిష్టంగా ఉన్న వార్డెన్‌ని సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. విజయనగరంలో బిసి బాలుర హాస్టళ్లకు సొంత భవనాలు లేక, వర్షం వస్తే పూర్తిగా నీరు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మెంటాడ మండలం పెదమేడపల్లి మోడల్ స్కూల్లో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న హిందీ టీచర్‌ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మెంటాడలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో తొలగింపునకు గురవుతున్న హైస్కూల్‌కు కొత్త భవనాలు వెంటనే నిర్మించాలని, మెరకముడిదాం జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక బడిబస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, హర్ష పాల్గొన్నారు.

'అసంతృప్తి' వినతులపై ప్రత్యేక దృష్టి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులు పరిష్కరించిన తీరుపై ఆయా అర్జీదారులు సంతృప్తి చెందకుంటే, వాటిని మళ్లీ పరిశీలించి సంతృప్తికర రీతిలో పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. ఇటువంటి వినతుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గత వారంలో అసంతృప్తి వ్యక్తమైన వినతుల పరిష్కారంపై కలెక్టర్ సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. పశుసంవర్ధక, గృహనిర్మాణం, విద్యుత్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, సాంఘిక సంక్షేమ తదితర శాఖలకు సంబంధించి 96 వినతుల పరిష్కారంపై అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైందని పేర్కొంటూ ఆయా వినతుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. మినీ గోకులం బిల్లులకు సంబంధించి డ్వామా, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా సమస్యను పరిష్కరించాలని సూచించారు.

గ్రీవెన్స్‌కు 223 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 223 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలత తదితరులు వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. రెవెన్యూ శాఖకు 142, గ్రామవార్డు సచివాలయాల శాఖకు 42, పంచాయతీరాజ్ విభాగానికి 17, గృహనిర్మాణానికి 9, డిఆర్‌డిఎకు 5, మున్సిపల్ శాఖకు 4, విద్యుత్ శాఖకు 3, వైద్య ఆరోగ్యశాఖకు 1 వినతులు అందాయి.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతి

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ ట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా చైర్మన్ బి.కాంతారావు ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, అవుట్ ట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. వినతి అందజేసిన వారిలో పి.దుర్గ, ఎన్‌హెచ్ఎం నాయకులు, ఎస్‌డి జోహరుద్దీన్, బి.శ్రీను పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణపై ఫిర్యాదు

విజయనగరంకోట : నగరంలోని ఒకటో డివిజన్ పరిధి అయ్యప్పనగర్ వద్ద గెడ్డవాగును కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీవరప్రసాద్, మురళీ మోహన్.. స్పందనలో కలెక్టర్‌కు వినతి అందించారు. ఆక్రమణల వల్ల పరిసర ప్రాంతాలు, కట్టడాలు భవిష్యత్తులో ముంపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై

31న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఈ నెల 31న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహనరావు తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. జొన్నవలస ప్రాథమిక పాఠశాల కార్మికులకు జనవరి నుంచి వేతనాలు బిల్లులు చెల్లించలేదని తెలిపారు. టమాటా కిలో రూ.150 ఉంటే పిల్లలకు పచ్చడి చేసి ఎలా పెట్టగలమని ప్రశ్నించారు. వంట నూనె, పప్పులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రస్తుత మెనూ ఛార్జీలతో జగనన్న గోరుముద్ద అమలు కష్టంగా ఉందని, అప్పులు చేయాల్సి వస్తుందని వారు వాపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.3 వేలు ఇచ్చి మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని తెలిపారు. కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిపై చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అచ్చియ్యమ్మ, పార్వతి, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలకు మహర్దశ

- ఎల్.కోటలో ఆరోగ్య మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్
- నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- జిల్లాలో రాగి పంట విస్తీర్ణం పెంచడానికి ప్రత్యేక ప్రణాళికలు



మిల్లెట్స్ ప్రాసెసింగ్ యంత్రాలు

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి

ఇక నుంచీ చిరుధాన్యాలు సిరులు కురిపించనున్నాయి. రైతు కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించడంతోపాటు, చిరుధాన్యాల సాగుకు మరింత ప్రోత్సాహం లభించనుంది. లక్కవరపుకోట మండలం రేగ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సిఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించ నున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు సిఎం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఈ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారు.

రూ.4 కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్

రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద సుమారు రూ.4.06 కోట్ల వ్యయంతో ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. కొత్తవలస ప్రాంతానికి చెందిన సుమారు 1500 మంది చిన్న, సన్నకార మహిళా రైతులు సభ్యులుగా ఉన్న ఆరోగ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తుంది. దీనిద్వారా ప్రత్యక్షంగా 30 మందికి ఉపాధి లభిస్తుంది. ప్రధానంగా రాగి పంట ఈ యూనిట్‌కు ముడిసరుకు కానుంది. ఇక్కడ రాగులను శుభ్రపరచడంతోపాటు రాగి పిండి, మిల్లెట్ బిస్కెట్లు, న్యూట్రిషన్ పౌడర్లు, వర్మిసెల్లీ, ఫ్లేక్స్ తదితర ఆహార పదార్థాలను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు. వీటితో పాటుగా జొన్నలు, కొర్రలు, సామలు, సజ్జలు తదితర రకాల చిరుధాన్యాలను కూడా ఇక్కడ ప్రాసెస్ చేసి విక్రయిస్తారు. ఈ యూనిట్‌లో ఏర్పాటు చేసిన మిషనరీ ద్వారా గంటకు 500 కిలోల చిరుధాన్యాలను ప్రాసెస్ చేయడంతో పాటుగా గంటకు 300 కిలోల రాగిపిండి, 200 కిలోల మిల్లెట్ ఫ్లేక్స్, 40 కిలోల కుకీస్, 30 కిలోల మిక్సర్ ఉత్పత్తి జరుగుతుంది. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి చిరుధాన్యాలను కొనుగోలు చేస్తారు.

పెరగనున్న చిరుధాన్యాల సాగు

జిల్లాలో చిరుధాన్యాల సాగు భారీగా విస్తరించనుంది. చిరుధాన్యాల పంటలకు ఉత్తరాంధ్ర ఎంతో అనుకూల ప్రాంతం. ఇటీవల కాలంలో బిపి, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులు ఎక్కువై పోతుండటంతో ప్రజల దృష్టి చిరుధాన్యాలవైపు మళ్లింది. ఆరోగ్యం, పోషకాల కోసం చిరుధాన్యాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించడం, కేంద్ర ప్రభుత్వం మిల్లెట్ మహోత్సవాలను నిర్వహిస్తుండంతో చిరుధాన్యాలవైపు అందరి దృష్టి మళ్లింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. రేషన్ డిపోల ద్వారా రాగి పిండి సరఫరా చేయడానికి నిర్ణయించింది. దీనికోసం రాగి పంట ఎంత పండించినా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. విజయనగరం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి, రాగి పంట సాగును రెట్టింపు చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. దీనిలో భాగంగా అధిక దిగుబడి, పోషకాలనిచ్చే రాగి వంగడాలను రైతులకు అందిస్తోంది. జిల్లాలో ఖరీఫ్‌లో రాగి పంట సాధారణ విస్తీర్ణం 80 ఎకరాలు కాగా, దాన్ని ఈ ఏడాది 2110 ఎకరాలకు పెంచడానికి నిర్ణయించారు. రబీలో రాగి సాగు 2500 ఎకరాలు ఉండగా, దానిని నాలుగింతలు చేసి, సుమారు 10 వేల ఎకరాలకు పెంచాలన్న ప్రణాళికను రూపొందించారు.

మిల్లెట్ల సాగుకు ప్రోత్సాహం



జిల్లాలో చిరుధాన్యాల సాగును పెంచేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నాం. రైతుకు మేలైన విత్తనాలను అందించడంతో పాటుగా మార్కెటింగ్ సౌకర్యాలను విస్తృతం చేస్తాం. ముఖ్యంగా రాగి పంటకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించడానికి ముందుకు వచ్చేవారికి జిల్లా యంత్రాంగం నుంచి సంపూర్ణ సహకారాన్ని అందిస్తాం.

- నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్

పూర్తయిన ఇళ్లకు సౌకర్యాలు కల్పించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇళ్లకు విద్యుత్తు, నీటి సరఫరాలను వెంటనే ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంఇఒలు, ఇంజినీరింగ్, మండల ప్రత్యేకాధికారులతో సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. హౌసింగ్, జగనన్న సురక్ష, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, గడపగడపకు, జగనన్నకు చెపుదాం వినతుల అసంతృప్తి, సంక్రమిత వ్యాధులు , ప్రయారిటీ భవన నిర్మాణాలు, సుస్థిర అభివృద్ధి సూచీలపై మండలాల వారీగా సమీక్షించారు.
జగనన్న కాలనీల్లో 25 ఇళ్లకు పైగా ఉన్న కాలనీల వద్ద స్వాగత ద్వారాలను నిర్మించాలని సూచించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కింద విద్యార్థుల నమోదు శత శాతం జరగాలని తెలిపారు. వాలంటీర్ యాప్ ద్వారా సర్వే చేసిన వారందరినీ శత శాతం మంగళవారం సాయంత్రంలోగా నమోదు చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కావాలన్నారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న ప్రయారిటీ భవనాల నిర్మాణాలు స్టేజ్‌లు వేగంగా మారాలని ఆదేశించారు. 15 రోజుల క్రితం నుండి నేటి వరకు జరిగిన పురోగతిపై ఆరాతీశారు. పురోగతి కనపడని వారికి ఛార్జిమెమోలు ఇస్తామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. పిహెచ్‌సిల్లో అత్యవసర మందులన్నీ అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ గణపతిరావు, సిపిఒ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని నాలుగో డివిజన్ పరిధి విజయలక్ష్మి నగర్, మంగళవీధి కాలనీ ప్రాంతాల్లో సుమారు రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, నగర ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్ మారోజు శ్రీను, జోనల్ ఇన్చార్జులు ముచ్చు శ్రీను యాదవ్, ముద్దాడ మధు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

స్పందన అర్జీదారులకు తక్షణ న్యాయం

విజయనగరం : స్పందన అర్జీదారులకు తక్షణ న్యాయం చేయాలని ఎస్‌పి దీపిక.. పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ స్పందన కార్యక్రమానికి 43 వినతులు అందాయి.

తైక్వాండో బ్లాక్ బెల్ట్‌టెస్ట్‌లో 8 మంది విద్యార్థుల ఎంపిక

విజయనగరంటౌన్ : జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో 8 మంది విద్యార్థులు అర్హత పొందారు. పి.పునీత్, వి.కుశాల్, కె.సాహిత్య, సంకీర్తన, ఎస్.సాత్విక్, ముఖేష్, రిషి, లిఖిత్ ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ అర్హత సాధించారు. వీరిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, శిక్షకులు యశస్విని, గగన్, రాజు, చైతన్య అభినందించారు.

చట్టాలను తెలుసుకోండి

విజయనగరం : చట్టాలను తెలుసుకొని కష్టాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి అన్నారు. మండలంలోని బియ్యాలపేట గ్రామ సచివాలయంలో సోమవారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, అసాంఘిక చర్యలకు పాల్పడినా చట్టరీత్యా శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో డిటి వి.జగన్నాథం మాట్లాడుతూ బాలకార్మికులున్నా, బాల్య వివాహాలను ప్రోత్సహించినా తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తాడిరాజు, బాల మురళి, పైలా కుమార్ పాల్గొన్నారు.

యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా 'సప్పా'


నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రసాద్

విజయనగరం: పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా సప్పా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో సోమవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు సురేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పువ్వు రాజారావు, పెద్దల కమిటీ చైర్మన్ తెడ్డపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనను ఎన్నుకున్నట్లు ప్రసాద్ తెలిపారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి జిల్లాలో ఉన్న పద్మశాలి కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఉన్న అన్ని మండలాలు తిరిగి ఆయా మండలాల్లోని కులపెద్దల సహాయ సహకారాలు తీసుకుని యువజన కమిటీలు వేసి పద్మశాలి కుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

నూతన పశువైద్య కేంద్రానికి కృషి

రేగిడి : మండలంలోని సంకిలిలో పశువైద్య కేంద్రం గత కొన్నేళ్లుగా శిథిలం కావడంతో సిబ్బందికి విధులకు ఇబ్బంది కారణంగా సర్పంచ్ బుడుమూరు పట్టాభి సోమవారం తనిఖీ చేశారు. ఈ పశువైద్య కేంద్రం పూర్తిగా శిథిల వ్యవస్థలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని ఉద్యోగ సిబ్బంది తెలిపారు. వర్షానికి పూర్తిగా కారిపోవడంతో మందులు తడిసి ముద్దవుతున్నాయని వెల్లడించారు. గ్రామపంచాయతీ తీర్మానంతో నూతన పశువైద్య కేంద్రానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

జాషువాకు ఘన నివాళి

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గుర్రం. జాషువా వర్ధంతిని తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ జాషువా గొప్ప ప్రజాకవి అని, సమాజంలోని వివక్ష తల వల్ల ఎన్నో అవమానాలు పొంది, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలని నిరసించారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షురాలు రేచర్ల శ్రీలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాల, వల్లంపూడిలో దళిత మహాసభ ఆధ్వర్యంలో ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు గుర్రం జాషువా వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము మాట్లాడుతూ జాషువా గొప్పతనాన్ని గూర్చి విద్యార్థులకు వివరించారు. జాషువా రచించిన సత్య హరిశ్చంద్ర ఘట్టాలలో కొన్ని విద్యార్థులకు వివరించారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

బాడంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసి జిన్నా హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లిన త్రినాథరావును, బయాలజీ ఉపాధ్యాయునిగా పనిచేసి తెర్లాం హెచ్‌ఎంగా పదోన్నతిపై వెళ్లిన ఎస్ఎస్ఎం రమేష్, పిఎజిఎస్ పట్నాయక్, ఎల్ భాస్కరరావు, ఎం.శ్రీదేవి, ఎ.చిన్నారావు, కె.సింహాచలం, ఎం.ముత్యాలు, కె.సాయి సతీష్, నాన్ టీచింగ్ సిబ్బంది కస్తూరి, లక్ష్మిలకు వీడ్కోలు పలికారు. కొత్తగా వచ్చిన హెచ్‌ఎం డి.సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు టి లక్ష్మి, యు.రామారావు, ఎస్.రామారావు, గోవిందరావు, సత్యన్నారాయణ, శ్రీనివాసరావు, నాన్ టీచింగ్ సిబ్బంది అప్పలనాయుడు, కుసుమలకు ఆహ్వానం పలుకుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన సన్మానం చేశారు.

పచ్చని చెట్లను నరికిన విద్యుత్తు సిబ్బంది

శృంగవరపుకోట: విద్యుత్ వైర్లను తాకుతున్నాయన్న నెపంతో పట్టణంలోని పచ్చని చెట్లను విద్యుత్ సిబ్బంది నరికివేశారు. పట్టణంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ పక్కన సుమారు 100 సంవత్సరాల నుంచి అందరికీ నీడనిస్తున్న అతి భారీ చెట్టును కొమ్మలు తొలగించాల్సింది పోయి పూర్తిగా చెట్టు మొదలనే తొలగించడం పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోని పచ్చని చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది ఇష్టారాజ్యంగా నరికి వేయడం పై న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని గౌరవ న్యాయమూర్తి సబ్బవరపు వాణి దృష్టికి బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యూ.ఎన్.శర్మ, కోశాధికారి బి.త్రిమూర్తులు, న్యాయవాదులు రావాడ సత్యన్నారాయణ, బొబ్బిలి రామకృష్ణ, శేఖర్, యమ్.ఆప్పారావు తదితరులు తీసుకువెళ్ళారు. చర్యను ఖండిస్తూ విద్యుత్ శాఖాధికారి నుండి వివరణ తీసుకోమని సూపరింటెండెంట్‌కు మెజిస్ట్రేట్ సూచించారు.

'మహాశక్తి'తో మహిళల భవిష్యత్తుకు గ్యారంటీ

నెల్లిమర్ల: టిడిపి మహాశక్తితో మహిళల భవిష్యత్‌కు గ్యారంటీ ఉంటుందని టిడిపి పార్లమెంటు మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. సోమవారం స్థానిక టీడిపి కార్యాలయంలో మహిళా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో ప్రవేశ పెట్టిన 'మహాశక్తి' మహిళల భవిష్యత్ గ్యారంటీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో నగర పంచాయతి పార్టీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, నియోజక వర్గం మహిళా అధ్యక్షులు చిల్ల పద్మ, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి చీకటి సుహాసిని, పార్లమెంట్ అధికార ప్రతినిధి కె. కళావతి, పార్లమెంట్ కార్యదర్శి ఎల్. హైమావతి, నాయకులు ఆర్. సంతోషి కుమారి, వై.లక్ష్మీ, ఎం.లక్ష్మీ, ఎన్. రామలక్ష్మీ, పి. కృష్ణ వేణి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అవినీతిపై సమగ్ర దర్యాప్తు

ప్రజాశక్తి కథనానికి స్పందన

బొబ్బిలిరూరల్: ఎం.బూర్జవలస పంచాయతీలో జరిగిన ఇళ్ల పట్టాల అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తిలో ప్రచురితమైన ఇళ్ల పట్టాల మంజూరులో అవినీతి వార్తకు తహశీల్దార్ రాజేశ్వరరావు స్పందించారు. ఎం.బూర్జవలసలో పర్యటించి అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి అనర్హులకు మంజూరు చేసిన పట్టాలను రద్దు చేయాలని విఆర్ఓ రేవతిను ఆదేశించారు. అర్హులకు పట్టాలు మంజూరు చేసి అనర్హులకు ఇవ్వకుండా చూడాలని ఆదేశించారు.

'భీమసింగి' మనుగడపై ప్రకటన చేయాలి

జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులతో ఫ్యాక్టరీ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ వెంటనే చెరకు రైతుల మహాజన సభను ఏర్పాటు చేసి ప్రభుత్వం ఫ్యాక్టరీ పై ఏమి నిర్ణయం తీసుకుందో ప్రకటించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో లోక్ సత్తాపార్టీ, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, జెనసేన, పార్టీ ప్రతినిధులతో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నేత కామేశ్వరరావు, టిడిపి నాయకులు బండారు పెదబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్, జనసేన నాయకుడు దేగల ఈశ్వర్రావు, వర్మ రాజు, సిపిఐ నాయకులు డేగల అప్పలరాజు, ఎల్. కోట, ఎస్. కోట, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా దర్యాప్తు

బొబ్బిలి: ఓటర్ల జాబితాపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌డిఒ పి.శేషశైలజ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో 264 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, 2,24,947 ఓట్లు ఉన్నాయన్నారు. ఓట్లు చేర్పులు, మార్పులు చేస్తున్నామని చెప్పారు. ఒకే డోర్ నెంబర్లో 10కంటే ఎక్కువ ఓట్లు ఉంటే సమగ్ర విచారణ చేస్తున్నామని చెప్పారు. ఓటర్ల జాబితా దర్యాప్తులో వాలంటీర్లు పాల్గొనకూడదన్నారు. బిఎల్‌ఒలతో కలిసి పోలింగ్ బూత్ ఏజెంట్లు దర్యాప్తులో పాల్గొనవచ్చునని చెప్పారు.

తప్పిన పెను ప్రమాదం

వేపాడ: మండలంలోని కెఆర్‌పేట సమీపంలో రైవాడ నుండి విశాఖపట్నం వెళ్లే తాగునీటి కాలువ కల్వర్టు మీద పెను ప్రమాదం తప్పింది. సోమవారం కొత్తవలస నుండి కెఆర్ పేటకు సివిల్ సప్లై గోడౌన్ నుండి సరుకులు తీసుకొని వెళుతున్న లారీ ఒక్కసారిగా కల్వర్టు కూలిపోవడంతో కాలువలోకి ఒరిగిపోయింది. ఈ లారీని క్రేన్ సహాయంతో పైకి తీశారు. ఈ సంఘటనలో ఏ ఒక్కరికి ప్రాణ నష్టం జరగలేదు. కల్వర్టుపై నుంచి కిందకు పడిపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

విజయనగరం : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి జెడ్‌పి విరాళాల నిధి నుంచి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన నక్కల అప్పన్నకు రూ.40 వేలు, విజయనగరం మండలం జొన్నవలసకు చెందిన అట్టాడ రవితేజ తండ్రి రాముకు రూ.25 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు.

28 నుంచి పోరుయాత్ర

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని బంగారం పేట గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో హింసపై పోరు యాత్ర కరపత్రాన్ని విడుదల చేశారు. దేశంలో, రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఐద్వా ఆధ్వర్యంలో జూలై 28 నుండి ఆగస్టు 9 క్విట్ ఇండియా డే వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగు బస్ జాతాను జయప్రదం చేయాలని ఈ జాత ఈ నెల 30న సాయంత్రం ఐదు గంటలకు గజపతినగరం మెంటాడ్ రోడ్డు జంక్షన్ దగ్గరకు వస్తుందని ఈ జాతాలో గజపతినగరం నియోజకవర్గంలో ఉన్న మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి లక్ష్మి పిలుపునిచ్చారు. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు పైన రోజురోజుకీ పెరుగుతుందన్నారు. దీనికి ఉదాహరణగా మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన నిలిస్తోందన్నారు. దేశంలో మహిళలకి మోడీ ప్రభుత్వం రక్షణ కల్పించే పరిస్థితిలో లేదన్నారు. దేశంలో మహిళలకు


కరపత్రాలను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు

మోడీ క్షమాపణ చెప్పాలని మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దేశంలో ఏదో ఒక మూల ప్రతి నిమిషానికి ఒక అఘాయిత్యం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి వెంటనే బాధ్యతలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు అచ్చియమ్మ, రిబక, శుభ, సన్యాసమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ఈ నెల 31న కలెక్టరేట్ వద్ద జరగనున్న మధ్యాహ్నం భోజనం పథకం ధర్నాను జయప్రదం చేయాలని మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు యూనియన్ నాయకులు (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి సుధారాణి పిలుపునిచ్చారు. సోమవారం గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి పదివేల రూపాయలు వేతనం చెల్లించాలన్నారు. నిరంతరం పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మెనూ చార్జీలను పెంచాలని రేషన్‌లైజేషన్ పాఠశాలలను విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని బడ్జెట్‌ను పెంచాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ చార్జీలకు సంబంధం లేకుండా రోజుకొక ఐటెంతో ప్రభుత్వం మెనూ తయారు చేసి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

వర్కర్లపై భారాన్ని మోపిందని అన్నారు. ఒకపక్క పని భారం మరోపక్క ధరల పెంపుదలతో పెరగని వేతనాలు మెనూ ఛార్జీలతో కార్మికులు పథకం నిర్వహించడం కష్ట సాధ్యంగా మారిందన్నారు. యూనిఫారం, గుర్తింపు కార్డులను ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, రాగి జావా తయారు చేయడానికి వంట పాత్రలు గ్యాస్ స్టవ్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవి, సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరికరాల కోసం నిధులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల కేంద్రంలో నిర్మిస్తున్న వంద పడకల ఏరియా ఆసుపత్రిలో ఆధునిక పరికరాల కోసం ఎంపి నిధులు మంజూరు చేయిస్తానని ఎంపి ఎంవివి సత్యనారాయణ హామీ ఇచ్చారు. సోమవారం మండల కేంద్రంలో గల ఏరియా ఆసుపత్రి 50 పడకల నుండి 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి, ఆధునీకరణలో భాగంగా నూతన భవనం మొదటి అంతస్థులో ఏర్పాటు చేసిన రక్తనిల్వ కేంద్రం, ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రాలను ఎమ్మెల్యే కడబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ 50 పడకల ఏరియా సుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ఆధునీకరించడం చాలా సంతోషదాయకమైన విషయమన్నారు. ప్రభుత్వం వైద్యం, విద్య, సంక్షేమం, వ్యవసాయం 4 రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట వేసిందని, రాష్ట్రంలో ప్రతి సగటు పౌరుడు ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. వ్యాధులను గుర్తించడం, వాటికి


రక్తనిల్వ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

సరైన పద్ధతిలో వైద్యాన్ని అందించడం లక్ష్యంగా రోగ నివారణకు ఖరీదైన మందులు అందివ్వటం జరుగుతుందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలలలో ఓపి పెరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం, ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్‌కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొప్పర, కొండచాకరాపల్లి, గీతనాపల్లి గ్రామాలలో భవిష్యత్తులో ఎటువంటి వరద ముప్పు లేకుండా చర్యలు చేపడతామని తహశీల్దార్ డి ఐజాక్ తెలిపారు. ప్రజాశక్తిలో ఈనెల 19న ముంచుకొస్తున్న వరద ముప్పు అనే కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ గతంలో ముంపునకు గురైన గ్రామాలలో పర్యటించి అక్కడ సమస్యను గుర్తించి నివేదిక ఇవ్వాలని చీపురుపల్లి ఆర్‌డిఒ ద్వారా తహశీల్దార్‌కు ఆదేశించారు. ఈ మేరకు తహశీల్దార్ డి. ఐజాక్, ఆర్‌ఐ జె మురళి గతంలో ముంపునకు గురైన ఆ మూడు గ్రామాలలో సోమవారం పర్యటించారు. సువర్ణముఖి నదిలో ఇసుక మేటలు వేయటం, ఈ గ్రామాలు మడ్డువలస ప్రాజెక్టుకు, ఎగువున దగ్గరగా ఉండటంతో వరదల సమయంలో ముంపునకు గురవుతున్నాయని, ప్రాజెక్టు ప్రధాన గేట్లు మరమ్మతులకు గురవటం, వరదల

ప్రజాశక్తి కథనానికి స్పందన

సమయాలలో గేట్లు ఎత్తేందుకు వీలు లేకపోవడం వల్ల ఆయా గ్రామాలలో వరద నీరు ఇళ్లల్లోకి ప్రవేశించడం, అక్కడ ప్రజలు ఇబ్బందులు పడటం జరుగుతోందన్నారు. నష్టం జరిగిన పంటలకు నష్టం పరిహారం కూడా చెల్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మడ్డువలస గేట్లు ఇటీవల మరమ్మత్తులు చేయటం వల్ల ఒక సమస్య పరిష్కారం అయిందని, సువర్ణముఖి నదిలో ఇసుక మేటలు చెత్తాచెదారాలు తొలగించేందుకు నిధులు మంజూరుకు ఇరిగేషన్ అధికారుల ద్వారా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినట్లు ఆయన చెప్పారు.

అక్కడ ఉన్న సమస్యను మరో మారు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- బొండపల్లి

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి ప్రాదాన్యత ఇవ్వాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి చల్ల చలం నాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులు లెవనెత్తిన ప్రజా సమస్యల పరిష్కారం పై అధికారులు దృష్టి సారించాలన్నారు. నెలివాడ గ్రామంలో ఓ ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను సవరించాలని ఆ గ్రామ సర్పంచ్ తాళ్ళపూడి కీర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గొట్లాం గ్రామానికి సంబంధించి ఒంపల్లి గ్రామానికి వెళ్ళే రహదారికి ఆనుకొని ఉన్న జగనన్న లే అవుట్‌లో విద్యుత్ వైర్లు తొలగిలించబడ్డాయని, వెంటనే విద్యుత్ వైర్లు పునరుద్ధరించాలని గొట్లాం పిఎసియస్ త్రిసభ్య కమిటీ చైర్మెన్ మహంతి రమణ కోరారు. వేంద్రాంలో తరాతరాలుగా సాగు చేస్తున్న ఇనాం భూములకు సంబందించి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని సర్పంచ్ కర్రోతు శ్రీనువాస రావు కోరారు. కాగా కచ్చితమైన ఓటర్ల జాబితా తయారికి అధికారులు పారదర్శకంగా పని చేయాలనీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. గ్రామాలలో ఓటర్ల సర్వే జరుగుతున్నదని ప్రజాప్రతినిధులు అందరు సహకరించా లని తహశీల్దార్ ప్రసాద్ రావు కోరారు. ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్య ప్రకాశరావు, ఎంపిడిఒ వైబి. రాజేంద్ర ప్రసాద్, వైస్ ఎంపిపిలు మీసాల సరోజినీ, గొండెల ఈశ్వర రావు, సర్పంచ్‌లు బొద్దల కృష్ణవేణి, నెట్టి ఏసురత్నం, కర్రి సత్యవతి, మునకాల పైడినాయుడు, బొండపల్లి ఈశ్వర రావు, ఎంపిటిసిలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందీ టీచర్ సస్పెన్షన్

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి ఎపి మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు వి. రామానంద సాగర్‌ను జిల్లా విద్యాశాఖధికారి బి లింగేశ్వర రెడ్డి సస్పెండ్ చేసినట్లు ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ జి. వేణుగోపాలం సోమవారం తెలిపారు. పాఠశాల విద్యార్థినిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 1న బొబ్బిలి డిప్యూటీ డిఇఒ పి. బ్రహ్మాజీరావు పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థినులు ఫిర్యాదు నిజమేనని పై అధికారులకు నివేదిక సమర్పించడంతో క్రమశిక్షణ చర్యలలో భాగంగా ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఓటు హక్కును కాపాడాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రతీ పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి ఎన్నికల అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 21 నుండి ఆగష్టు 21 వరకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు సర్వేచేస్తారన్నారు. వారితో పాటు ప్రతి పక్షపార్టీలు నియమించుకున్న బిఎల్‌ఒలు కూడా పాల్గొని ఆయా గ్రామాలలో ఉన్న బూత్‌లు ప్రకారంగా చేయాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఆదేశాలు ఇచ్చాయని ఆమె తెలిపారు. స్థానిక చింతల దిమ్మ పిఎస్ నెం22లో ఓట్లు కొన్ని తహశీల్దార్ కార్యాలయం దగ్గర, ఆఫీషియల్ కాలనీలోని ఓట్లు ట్రేసౌట్ కావడం లేదని, శ్రీనివాస కాలనీ ఒక పిఎస్‌లో ఒకే ఇంటి నెంబరుతో 45-48 ఓట్లు ఉండటం, టిడిపి బూత్ లెవెల్ ఏజెంట్స్ గుర్తించారని ఆమె వెల్లడించారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ఓటమి భయంతో వైసిపికి వ్యతిరేక ఓటర్ల జాబితాలను వాలంటీర్ వ్యవస్థతో ద్వారా గుర్తించి తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, టిడిపి విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, వార్డు మెంబర్ సరిపల్లి రామకృష్ణ, యువత పెదగాడ రాజు, తదితరులు పాల్గొన్నారు.

దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మణిపూర్‌లో ఆదివాసీ మహిళల పై ఉన్మాదుల అత్యాచార దాడులు చేయడం దుర్మార్గమని వామ పక్ష నేతలు కిల్లంపల్లి రామరావు, మొయిద పాపారావు ఆందోళన వ్యక్తం చేశారు. సోమ వారం కొండ గుంపాంలో సిపిఐ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటన పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మతోన్మాదులు ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం సిగ్గుచేటన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత గిరిజన మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గత 6నెలలుగా మణిపూర్‌లో మతోన్మాద శక్తులు పెట్రేగిపోయి ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంటే కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం చోద్యం చూసి పట్టించుకోలేదన్నారు. బిజెపి ప్రభుత్వానికి పాలించే హక్కు లేదని వెంటనే మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాడ్ చేశారు. మణిపూర్ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్నూరు సూర్యరావు, లెంక రాజి నాయుడు, పతివాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపాలి

రామభద్రపురం: గత 22 రోజులుగా సమ్మె చేస్తున్న స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమ్మెకు పరిష్కారం చూపాలని సిఐటియు నాయకులు బలస శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలం,లక్ష్మి, శ్యామల, తౌడు, కృష్ణ, పోలిరాజు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి మరింత కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని వల్లూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు వీధుల్లో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు తీరును లబ్ధి దార్లను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం మరింత కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, ఎంపిడిఒ జి. గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని సింగరాయ గ్రామంలో సోమవారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ


నెల్లిమర్ల: బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

సదర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపిపి డి సత్యవంతుడు, ఎంపిటిసి రాయవరపు రాజేష్, జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, మండల జెసిఎ కన్వీనర్ శ్రీను, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీడపీడల నివారణ

ప్రజాశక్తి- డెంకాడ

కాషాయాలతో చీడపీడల నివారణ సాధ్యమవుతుందని అమకాం యూనిట్ ఇంచార్జి పిన్నింటి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని చిట్టిగుంకలాంలో ఎన్‌పిఎం దుకాణం వద్ద 100లీటర్ల దశపర్ని కషాయాన్ని రైతుల సమక్షంలో ఆమె సోమవారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగుమందులు, ఎరువులు వాడటం వల్ల మనం తినే ఆహారం కలుషితం అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు వేసి కషాయాలు వాడి పండించిన పంటలను తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు.

జనసేనలో యువత చేరిక

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేనలో పలువురు యువకులు చేరారు. రామభద్రపురం మండలం అప్పలరాజు పేటకు చెందిన పలువురు యువకుల బొబ్బిలిలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. యువకులకు బాబు పాలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనపై యువత అసంతృప్తి చెందడంతో జనసేనలో చేరుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలను, యువతను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. జనసేన అధికారంలోకి వస్తే ప్రజలు, యువతకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, బి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు టిడిపి వినతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఏటి అగ్రహారం, పడాలపేట పునరావాస ప్యాకేజీపై టిడిపి నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, జిల్లా టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పొతల రాజప్పన్న, పార్లమెంట్ బీసీ సెల్ సాధికార సమితి కన్వీనర్ చింతపల్లి వెంకటరమణ, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు ఆయా గ్రామాల బాధితులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

నందిగాంలో పశువిజ్ఞాన బడి

భోగాపురం: మండలంలోని నందిగాం రైతు భరోసా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో విజయనగరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కేంద్రంలో పశుసంవర్ధక సహాయకుని ద్వారా అందుతున్న సేవలను గురించి పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణం పొందేందుకు ఆర్‌బికెలోని సహాయకుని ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సబ్సిడీ పై సంపూర్ణ మిశ్రమ దాణా సరఫరా కోసం ఆర్‌బికెలను సంప్రదించాలన్నారు. అత్యవసర సమయాల్లో 1962 పశు అంబులెన్స్ సేవలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం భోగాపురం, చాకివలస ఆర్‌బికెలను సందర్శించారు. తర్వాత భోగాపురం పశువైద్యశాలను సందర్శించి దస్త్రాలు పరిశీలించారు. ఆయనతో పాటు భోగాపురం ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఉమాశంకర మహాపాత్రో, ముంజేరు పశువైద్యాధికారి డాక్టర్ యు.రామరాజు ఉన్నారు.

అధికంగా మందులు నిల్వ ఉంచొద్దు

ప్రజాశక్తి- విజయనగరం

గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపి గ్రామీణ వైద్యులు అధిక మోతాదులో అధిక సంఖ్యలో మందులు నిల్వ చేయవద్దని డ్రగ్ అండ్ కాస్మెటిక్ చట్టం ప్రకారం విరుద్ధమని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక వైద్య అవసరాల నిమిత్తం మాత్రమే మందులు ఆర్‌ఎంపిల దగ్గర ఉంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలతో ప్రజా ప్రతినిధులతో సఖ్యతతో సంబంధాలు కలిగి ఉండాలని చట్ట బద్ధంగా వ్యవహరించే వారికి అసోసియేషన్ అండగా ఉంటుందని అన్నారు. అత్య అవసర సమయంలో దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగులను రిఫర్ చేయాలని చెప్పారు.

ఓటర్ల నమోదు పరిశీలన

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని యం భూర్జి వలస, గున్నతోట వలస గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యమాన్ని తహశీల్దార్ డి. రాజేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఒకే డోర్ నెంబర్ పై ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు తెలిస్తే జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. చనిపోయిన వారి పేర్లు తొలగింపులో జాగ్రత్త వహించాలన్నారు. వలసలు పోయిన వారి పేర్లు, శాశ్వత వలసలు పోయిన వారి పేర్లు, సరి చూడాలని అయన బిఎల్‌ఒలకు ఆదేశించారు.

మాజీ ఎంపిపి అన్నపూర్ణమ్మ మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మాజీ ఎంపిపి సైలాడ అన్నపూర్ణమ్మ (54) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె భర్త సైలాడ త్రినాథరావు టిడిపి నుంచి అయ్యన్నపేట గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. అన్నపూర్ణమ్మ మృతి వార్త తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, ఘన నివాళులర్పించారు.

మాజీ కౌన్సిలర్ నాగరాజు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

మాజీ కౌన్సిలర్ బూర్లి నాగరాజు(50) అనారోగ్యంతో సోమవారం మరణించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు సార్లు కౌన్సిలర్‌గా విజయం సాధించారు. నాగరాజు సతీమణి ధనలక్ష్మి కూడా కౌన్సిలర్‌గా పని చేశారు. నాగరాజు మృతితో రావువారి వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పల నాయుడు, వైసిపి నాయకులు వేణుగోపాల్‌నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సంతాపం ప్రకటించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ముగడ గ్రామానికి చెందిన ఈదిబిల్లి గంగరాజు (34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను 6 సంత్సరాలు క్రితం గొల్లాది గ్రామానికి చెందిన గంగని వివాహం చేసుకున్నాడు. మందుకు బానిసై భార్యపై అనుమానం తో మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. వెంటనే స్థానిక సిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 10 గంటలకు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తల్లి గిరిధిపల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌క్మి జయంతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండలంలోని గుంకలాం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గొట్లాం వైపు నుంచి చెల్లూరు వైపు వెళ్తున్న కారు గుంకలాం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన లంక గోవిందరావు (45) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ మృతిచెందాడు. కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ గణేష్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

11 మంది అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని జొన్నాడ గ్రామ సమీపంలో 11 మంది జూదరాలను పట్టుకొని వారి వద్ద నుండి రూ.1.60లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ యు మహేష్ సోమవారం తెలిపారు. గ్రామం సమీపంలో ప్రైవేట్ లేఔట్‌లో నిత్యం పేకాట శిబిరం నిరసిస్తున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని పట్టుకున్నామన్నారు. వీరందరిపైనా కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని చెప్పారు.

మరో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గొట్లాం రైల్వే ట్రేక్ పై హత్యకు గురైన లారీ డ్రైవర్ కేసులో మరో నిందుతుడుని అరెస్టు చేసినట్లు గజపతినగరం సిఐ లెంక అప్పలనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురును అరెస్టు చేశామని ఇప్పుడు బోడసింగిపేటకు చెందిన దనుంజయ్‌ను అరెస్ట్ చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో బొండపల్లి ఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.